క్లుప్తంగా

100 మందికి ఉచిత నేత్ర వైద్య పరీక్షలు

మచిలీపట్నంటౌన్: స్థానిక రాజుపేట షాదీఖానాలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ జి.భానుమూర్తి 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 23 మందికి ఆపరేషన్ అవసరమని నిర్ధారించి ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో మోడ్రన్ ఐ ట్రస్ట్ చైర్మన్ నియాజ్, ఆసుపత్రి సిబ్బంది, షాదీఖానా నిర్వాహకులు పాల్గొన్నారు.

కేయూలో స్వచ్ఛ ఆంధ్ర

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయంలో శనివారం స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రిజిస్ట్రార్ ఆచార్య కె.శోభన్ బాబు పర్యవేక్షణలో బోధనేతర సిబ్బంది విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు ముళ్ల చెట్లను తొలగించారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ బోధనేతర సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు, డైలీ వేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరక్షరాస్యులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన

పెడన: నిరక్షరాస్యులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించాలని వయోజన విద్య ఉప సంచాలకుడు ఎండీ హాజీబేగ్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం గ్రామ సమైఖ్య సహాయకులను వయోజన విద్య టీచర్లుగా విద్యాబోధన చేయడానికి ఒక రోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.జయరాం, ట్రైనర్ ఆర్.సత్యనారాయణ, వెలుగు ఏపీఎం శ్రీదేవి, గ్రామ సమైఖ్య సహాయకులు పాల్గొన్నారు.

రేషన్‌షాపుల భర్తీకి రాత పరీక్ష

చిలకలపూడి(మచిలీపట్నం): బందరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్ షాపుల భర్తీ కోసం అభ్యర్థులకు శనివారం రాత పరీక్షలు నిర్వహించారు. నగరంలోని నోబుల్ కళాశాలలో నిర్వహించిన ఈ పరీక్షలను ఆర్డీవో కె.స్వాతి పర్యవేక్షించారు. డివిజన్ పరిధిలో 46 షాపుల భర్తీ కోసం 119 మంది దరఖాస్తు చేసుకోగా వీరిలో 100 మంది పరీక్ష రాసేందుకు అర్హులయ్యారు. పరీక్షకు 89 మంది మాత్రమే హాజరయ్యారు.

సాగరతీరంలో పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలి

కోడూరు: హంసలదీవి సాగరతీరానికి వచ్చే పర్యాటకులు అప్రమత్తంగా వ్యవహరించి సముద్రస్నానాలు చేయాలని పాలకాయతిప్ప మెరైన్ సీఐ సురేష్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం బీచ్ వద్ద పర్యాటకులకు అవగాహన కల్పించారు. తీరం ఒడ్డు వెంట గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నాయని సీఐ చెప్పారు. సాగరసంగమం వద్ద ఊహకందని లోతు ఉండడంతో అక్కడకు పర్యాటకుల రాకపోకలను నిషేధించినట్లు తెలిపారు. బీచ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ పూర్ణమాధురి, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

పెడన: మచిలీపట్నంలో ఒక మసీదులో జరిగిన సంఘటన నేపథ్యంలో అటువంటి చర్యలు మళ్లీ పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టే పనిలో పెడన పోలీసులు నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా శనివారం పట్టణం, మండలంలోని అన్ని దేవాలయాలు, చర్చిలు, మసీదులలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాల్సిందిగా ఆయా కమిటీల వారికి సచివాలయాల్లోని వార్డ్ ఉమెన్ ప్రొటక్షన్ సెక్రటరీ (డబ్ల్యూడబ్ల్యూపీఎస్)ల ద్వారా నోటీసులను అందజేశారు.

హైరిస్క్ ప్రెగ్నెన్సీ మహిళకు డెలివరీ

చల్లపల్లి(అవనిగడ్డ): నాగాయలంకకు చెందిన 35 సంవత్సరాల మహిళకు చల్లపల్లి కీర్తి హాస్పిటల్ వైద్యులు హైరిస్క్ డెలివరీ చేశారు. బీపీ, షుగర్‌తో పాటు కొన్ని అనారోగ్య సమస్యలు ఉండటం వల్ల ఈ మహిళకు గతంలో ఐదుసార్లు అబార్షన్ అయింది. ఆరోసారి కీర్తి హాస్పిటల్‌లో డాక్టర్ కీర్తి మందులు వాడగా నాలుగు రోజుల క్రితం ఆపరేషన్ చేసి ఆడబిడ్డకు ఊపిరి పోశారు. శనివారం డిశ్చార్జ్ చేశారు. ఈ ఆపరేషన్‌కు అనస్తీస్ట్ డాక్టర్ కృష్ణ, పిడియాట్రిషన్ డాక్టర్ సుధాకర్, ఫిజీషియన్ డాక్టర్ ఎస్.భవానీప్రసాద్ సహకారం అందించినట్టు డాక్టర్ కీర్తి తెలిపారు.

కనకపెన్నమ్మ జాతర ప్రారంభం

కృత్తివెన్ను: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో కనకపెన్నమ్మ అమ్మవారి జాతర మహోత్సవం వైభవంగా ప్రారంభమైంది. ఈ ఉత్సవాలు ఆది, సోమవారాలు కొనసాగుతాయి. మూడేళ్లకొకసారి మూడు రోజుల పాటు జరిగే ఈ జాతర కోసం దేశవిదేశాల నుంచి గ్రామస్తులు గ్రామానికి చేరుకున్నారు. జాతరలో గణాసారులు అమ్మవారి ప్రతిరూపాలుగా భావించే గరగలను నెత్తిన పెట్టుకుని గ్రామంలో ఊరేగారు.

పైపులైన్‌కు మరమ్మతులు

కొత్తపేట(అవనిగడ్డ): స్థానిక పంచాయతీ పరిధిలోని కొత్తపేట వద్ద ధ్వంసమైన పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు. రెండు రోజుల క్రితం ఇక్కడ వాహనం వెళ్లడం వల్ల పైపులైన్ దెబ్బతింది. మరమ్మతు పనులు శనివారం పూర్తయ్యాయని, తాగునీటి సరఫరా పునరుద్ధరించినట్టు సర్పంచ్ ఉమా తెలిపారు.

మనుషులుగా గుర్తించండయ్యా..!

- శ్రీకాకుళం యానాదుల ఆవేదన
- కనీస సౌకర్యాలకు నోచుకోని వైనం

శ్రీకాకుళం(ఘంటసాల): ''మమ్మల్ని కనీసం మనుషులుగా అయినా గుర్తించి మాకు కనీస సౌకర్యాలు కల్పించండయ్యా'' అంటూ ఘంటసాల మండలం శ్రీకాకుళం గ్రామంలోని యానాదులు ప్రభుత్వాన్ని దీనంగా అభ్యర్థిస్తున్నారు. తాము 60 ఏళ్లకు పైగా ఈ ప్రాంతంలోనే నివసిస్తున్నామని, తమకు కనీసం ఉండటానికి ఇల్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కూడా లేదని, ఏ క్షణంలో ఎలాంటి ప్రమాదాలు సంభవిస్తాయోనని భయంభయంగా బిక్కుబిక్కుమంటూ జీవించాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా నాయకులు వచ్చి, మాకు ఓట్లు వేస్తే మీ సమస్యలు తీరుస్తామంటారే గాని గెలిచిన తర్వాత తమ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదంటూ తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. దీనికి తోడు కొంతమందికి ఆధార్ కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు కూడా నోచుకోని పరిస్థితి నెలకొంది. ఆయా సమస్యలపై ఎంతమందికి మొర పెట్టుకున్నా తమకు న్యాయం జరగడం లేదని, ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలో సుమారు 1098 మంది యానాది కుటుంబాలు ఉన్నాయని, దాదాపు అందరూ ఇదే సమస్యలతో బాధపడుతున్నామని యానాది మహానాడు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా విజయబాబు తెలిపారు.



ఘంటసాల మండలం శ్రీకాకుళం యానాది కాలనీలో నివసిస్తున్న యానాదుల కుటుంబాల వారు

మాకు శ్రీకాకుళంలోనే ఇళ్ల స్థలాలు ఇప్పించండి



నేను 60 ఏళ్లకు పైగా శ్రీకాకుళంలోనే ఉంటున్నాను. మాకు ఇళ్ల స్థలాలు ఇప్పటి వరకు ఇవ్వలేదు. ప్రస్తుతం చెరువు కట్టపై ఉంటున్నాం. ఎప్పుడు పడితే అప్పుడు ఖాళీ చేయాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. గత ప్రభుత్వంలో నల్లకుంట వద్ద 4 కి.మీ. దూరంలో ఇచ్చారు. పిల్లా జల్లాతో ఇబ్బందులు పడటమే కాక జీవనోపాధి లేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఈ గ్రామంలోనే స్థలాలు ఇప్పించాలి.

– కొమరగిరి సీతయ్య, యానాదికాలనీ, శ్రీకాకుళం

మా సమస్యలు పరిష్కరించండి



శ్రీకాకుళంలో ఇదే ప్రాంతంలో సుమారు 70 ఏళ్లకు పైగా మా తాతలు, తండ్రులు నివసిస్తున్నారు. ఇప్పటివరకు ఇక్కడ రోడ్డు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఎన్ని ప్రభుత్వాలు మారినా మమ్మల్ని కనీసం మనుషులుగా కూడా గుర్తించడం లేదు. ఇది దేవస్థానం భూమి అని వారు అభ్యంతరం చెప్తున్నారని సాకుతో మా కాలనీని పట్టించుకోవడం లేదు.

– కొమరగిరి మునలయ్య, యానాది మహానాడు సంఘం, శ్రీకాకుళం

ఆధార్ కార్డు కోసం తిప్పలు తప్పడం లేదు



మాది బాపట్ల జిల్లా భట్టిప్రోలు గ్రామం. పెళ్లి తర్వాత శ్రీకాకుళం వచ్చి 20 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నా. ఇప్పటి వరకు నాకు ఆధార్ కార్డు లేదు. దరఖాస్తు చేసుకుంటే మీ ఊర్లో ఉందేమో చూడమంటే ఎన్నోసార్లు తిరిగినా. అక్కడ లేదంటే, ఇక్కడ లేదంటారే కాని ఆధార్ కార్డు ఎవరూ ఇవ్వడం లేదు. దీంతో ప్రభుత్వ పథకాలు ఏవీ రావడం లేదు. ఓటు హక్కు కూడా లేకుండా పోయింది. నాకు ఆధార్ కార్డు ఇప్పించండి.

– కోనేటి కోటేశ్వరరావు, యానాది కాలనీ, శ్రీకాకుళం

నాకు, నా భార్య, పిల్లలకు ఆధార్ కార్డులు లేవు



నా పేరు పోలయ్య, నాకు భార్య, ఐదుగురు పిల్లలు ఉన్నారు. నాకు, నా భార్యకు, నలుగురు పిల్లలకు ఇప్పటివరకు ఆధార్ కార్డులు లేవు. ప్రభుత్వం నుంచి వచ్చే ఏ పథకం రావడం లేదు. రేషన్ కూడా రాకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉంది. ఆధార్ కార్డులు పెట్టుకుంటే పుట్టిన తేదీ కావాలంటున్నారు. మాకు చదువుల్లేవు. అవేమి తెలియవు.

– తుమ్మ పోలయ్య, యానాది కాలనీ, శ్రీకాకుళం

అవనిగడ్డ డీఎస్పీగా తాళ్లూరి విద్యశ్రీ



అవనిగడ్డ: అవనిగడ్డ నూతన డీఎస్పీగా తాళ్లూరి విద్యశ్రీని నియమిస్తూ డీజీపీ కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. శిక్షణ పూర్తి చేసుకుని ప్రొబెషనరీ డీఎస్పీగా ఆమె వస్తున్నారు. అవనిగడ్డ డీఎస్పీగా పనిచేసిన మురళీధర్ పదిరోజుల క్రితం ఇంటిలిజెన్స్ డీఎస్పీగా బదిలీపై వెళ్లారు.

ఎస్టీ కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ



ఎస్టీలకు నిత్యావసర వస్తువులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న వేములపల్లి సురేష్

పురిటిగడ్డ(అవనిగడ్డ): చల్లపల్లి మండల పరిధిలోని పురిటిగడ్డలో ఐవీఎం ఆధ్వర్యంలో శనివారం రెండు ఎస్టీ కాలనీలకు లక్ష రూపాయల విలువగల నిత్యావసర వస్తువులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఐవీఎం ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ వేములపల్లి సురేష్–రోజా దంపతులు వీటిని అందజేశారు. కార్యక్రమంలో విదేశీ అతిథులు హిల్లరీ, కారెన్‌తో పాటు ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

పెడన: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం 15వ వార్డులోని బస్టాండు, 16వ వార్డులోని చేపల మార్కెట్‌లను పరిశుభ్రం చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ నాయకులు అబ్దుల్ ఖయ్యూం, వాహెబ్‌ఖాన్, బెజవాడ నాగరాజు, జితేంద్ర, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చదనం – పరిశుభ్రతకు ప్రాధాన్యం

గూడూరు: ప్రతి ఒక్కరూ పరిసరాలలో మొక్కలు నాటడంతో పాటుగా పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు కోరారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా గూడూరులోని వ్యవసాయ శాఖ కార్యాలయం ఆవరణలో ఆయన మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేయించారు, కార్యక్రమంలో సర్పంచి లింగం సులోచనారాణి, ఎంపీడీఓ బి.రాజేశ్వరి పాల్గొన్నారు.

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్‌లో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో పిచ్చిమొక్కలు తొలగించటంతో పాటు పరిశుభ్రం చేశారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు, కలెక్టరేట్ ఏవో సీహెచ్ వీరాంజనేయప్రసాద్, స్వచ్ఛ చల్లపల్లి ప్రతినిధి తూము వెంకటేశ్వరరావు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్‌పై ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ తదితరులు

శ్రీకాకుళంలో స్వచ్ఛ దివస్

శ్రీకాకుళం(ఘంటసాల): శ్రీకాకుళం పంచాయతీలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళంలోని ఎంపీపీ పాఠశాల ముందు ఎంపీడీఓ డి.సుబ్బారావు సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్, ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా)లతో కలసి మొక్కలు నాటారు. అనంతరం రోడ్లను పరిశుభ్రం చేసి బస్టాండ్ వరకు ర్యాలీ చేసి మానవహారం ఏర్పాటు చేశారు.

సబ్ జైలు సందర్శించిన న్యాయమూర్తి



చిలకలపూడి(మచిలీపట్నం): నగరంలోని సబ్ జైలును శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య సందర్శించారు. జైలులో ఉన్న ముద్దాయిలకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు జైలులో ఉన్న ముద్దాయిలను కులపరంగా వివక్ష చూపటం జరుగుతుందా అని అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి పనులు అప్పగించటం లేదని ముద్దాయిలు తెలపటంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ ముద్దాయిలకు న్యాయసహాయం కావాలంటే తమ సంస్థకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ పిల్లా రమేష్, డెప్యూటీ జైలర్ బి.అప్పారావు, మెడికల్ ఆఫీసర్ యార్లగడ్డ బాలసుబ్రహ్మణ్యం, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ చీఫ్ ముసలయ్య, ఎస్ఐలు సుబ్రహ్మణ్యం, పీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిరోధించాలి

చిలకలపూడి(మచిలీపట్నం): నగరంలోని సుకర్లాబాద్ ఆర్‌సీఎం హైస్కూల్‌లో న్యాయసేవాధికార సంస్థ, తూనికలు, కొలతల శాఖ ఆధ్వర్యంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య మాట్లాడుతూ బాల్యవివాహాలను నిరోధించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చునన్నారు. సదస్సులో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ ముసలయ్య, న్యాయవాది అజ్మతున్నీసా తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో రైతులకు తీరని అన్యాయం

- మాజీ సీఎం జగన్ చుక్కల భూములకు విముక్తి కల్పించారు
- కూటమి ప్రభుత్వం మళ్లీ వాటిని నిషేధిత జాబితాలో చేర్చింది
- మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: ఎన్నికలకు ముందు రైతులకు ఎన్నో చేస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు తీరని అన్యాయం చేశాయని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సింహాద్రి రమేష్‌బాబు ఎద్దేవా చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో చంద్రబాబు పాలనలో దివిసీమలో వేలాది ఎకరాలు నిషేధిత భూముల జాబితా (22ఎ)లో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ జాబితా నుంచి భూములను తొలగించి విముక్తి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే తిరిగి వాటిని నిషేధిత జాబితాలో చేర్చి రైతులకు తీరని అన్యాయం చేసిందన్నారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ఆసరా కల్పించేందుకు ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఇచ్చిన రైతు భరోసా గురించి కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. గత ప్రభుత్వం వ్యవసాయానికి తొమ్మిది గంటలు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తే ఈ ప్రభుత్వం రెండు గంటలు తగ్గించి ఏడు గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తూ రైతులను మోసం చేసిందన్నారు. గత ఏడాది జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏ గ్రేడ్ రకం ధాన్యం బస్తా 2,100కు కొనుగోలు చేస్తే ఇప్పుడు రూ.1,500కు మాత్రమే కొనుగోలు చేసి రైతులను కుదేలు చేసిందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి గాజుల జైరమేష్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

రాష్ట్రాన్ని స్వర్ణ, స్వచ్ఛ ఆంధ్రగా తీర్చిదిద్దుకుందాం

మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నంటౌన్: ప్రతినెల మూడవ శనివారాన్ని స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్రగా పాటించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దామని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక 3వ డివిజన్ మాచవరం(జోశ్యుల వారి తోట)లో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో మంత్రి పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం ప్రభుత్వ బీసీ కళాశాల బాలుర వసతి గృహం వద్ద చీపురు పట్టి పరిశుభ్రం చేశారు. అనంతరం మానవహారంగా ఏర్పడిన విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు తదితరులు మాట్లాడారు. అనంతరం మంత్రి కూటమి నాయకులతో కలిసి మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా జెడ్పీ ఆవరణలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జనసేన నాయకుడు బండి రామకృష్ణ, కమిషనర్ బాపిరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, కార్పొరేటర్లు, పలు డివిజన్ల ఇన్చార్జులు పాల్గొన్నారు.



మొక్కలు నాటిన మంత్రి కొల్లు రవీంద్ర, కొనకళ్ళ

నగరంలో ఫ్లెక్సీల రగడ

మచిలీపట్నంటౌన్: నగరంలో ఫ్లెక్సీల రగడ రాజుకుంది. అధికార కూటమి నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను నెలల తరబడి తొలగించని టౌన్ ప్లానింగ్ సిబ్బంది వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసే ఫ్లెక్సీలను కట్టకుండానే అడ్డుకుంటున్నారు. అయిదో డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ వేముల వనబాబు పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం అర్ధరాత్రి జిల్లా పరిషత్ సెంటర్లో కార్యకర్తలు బ్యానర్లు కడుతున్న సమయంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది వెళ్లి అడ్డుకున్నారు. అయితే నగరంలోని పలు కూడళ్లలో కూటమి నాయకులు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు మాత్రం నెలల తరబడి అలాగే ఉంటున్నాయి. ఈ విషయమై శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఆయన మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న డివైడర్‌కు కట్టిన కూటమి నాయకుల ఫ్లెక్సీలను తొలగించేలా సిబ్బందిని ఆదేశించారు. సిబ్బంది వాటిని తొలగించి మున్సిపల్ కార్యాలయంలో ఉంచారు. అంతలోనే కూటమి నాయకులు అక్కడికి చేరుకుని ఆ ఫ్లెక్సీలను మళ్లీ అక్కడే కట్టించారు. మున్సిపల్ కార్యాలయం ముందే తొలగించిన ఫ్లెక్సీలు మళ్లీ కట్టినా కమిషనర్ బాపిరాజు, టౌన్ ప్లానింగ్ అధికారి హరి ప్రసాద్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో నగరంలో అనుమతి లేకుండా ఫ్లెక్సీలు కట్టొద్దు అని కమిషనర్ బాపిరాజు శనివారం ఒక ప్రకటన జారీ చేశారు.



మున్సిపల్ కార్యాలయం ముందు తొలగించిన ఫ్లెక్సీని మళ్లీ కట్టిన కూటమి నాయకులు

మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు ఘన నివాళి

సాక్షి నెట్‌వర్క్ : మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు దివంగత ఎన్టీ రామారావు వర్ధంతి సందర్భంగా శనివారం మచిలీపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలోని మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు ఘన నివాళులర్పించారు. జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర, పెడనలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, అవనిగడ్డలో నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, ఆయా మండల కేంద్రాల్లో స్థానిక టీడీపీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పెడనలో టీడీపీ కార్యకర్తలు రక్తదానం చేశారు. గూడూరు పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నాగాయలంకలో వృద్ధుల ఆశ్రమంలో బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మోపిదేవిలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు.



పెడన టీడీపీ కార్యాలయంలో రక్తదానం చేస్తున్న కార్యకర్తల వద్ద ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

వాసవి క్లబ్ కార్యవర్గాల ప్రమాణ స్వీకారం

మచిలీపట్నంటౌన్: వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ సంస్థ అనుబంధ వాసవి క్లబ్, వనిత, కపుల్స్ క్లబ్‌ల నూతన కార్యవర్గ సభ్యులు శనివారం రాత్రి ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక విజయవాడ రోడ్ లోని శ్రీపాద ఫంక్షన్ హాల్ లో జరిగిన సమావేశంలో క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అన్నం సాయి సునీత నూతన పాలక వర్గాలతో ప్రమాణ స్వీకారం చేయించారు. వాసవి క్లబ్ అధ్యక్షునిగా జల్లూరి రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా విజయవరపు ప్రసాద్, కోశాధికారిగా సామా గణేష్, వనిత క్లబ్ అధ్యక్షురాలుగా కేఎస్ఎల్ శ్రీదేవి, ప్రధాన కార్యదర్శిగా ఆర్.పూర్ణ షామిలి, కోశాధికారిగా ఎ.సంగీత, కపుల్స్ క్లబ్ అధ్యక్షునిగా టి.మధుసూదన ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా టీఎస్వీఎస్ ప్రసాద్, కోశాధికారిగా మామిడి వెంకట రామ భాస్కర్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇంటర్నేషనల్ సీనియర్ ఉపాధ్యక్షురాలు తాత రజనీకుమారి హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో పోస్టు ఉమెన్‌కు తీవ్ర గాయాలు

మోపిదేవి: ఆగిఉన్న ద్విచక్రవాహనాన్ని మినీలారీ బలంగా ఢీ కొనడంతో పోస్ట్ ఉమెన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధిలోని ఉత్తర చిరువోలు లంకకు చెందిన నడకుదుటి భాగ్యలక్ష్మి నాగాయితిప్ప గ్రామంలో పోస్ట్ ఉమెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం ఉప తపాలా కార్యాలయం నుంచి బ్యాగ్ తీసుకుని మోపిదేవి పోస్టాఫీసుకు ద్విచక్రవాహనంపై తన భర్త నరసింహారావుతో బయలు దేరారు. మోపిదేవిలంక దాటిన తరువాత రోడ్డు పక్కన తమ ద్విచక్రవాహనం నిలిపి ఫోన్ చేస్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన మినీలారీ బలంగా ఢీ కొట్టింది. లారీ కొద్ది దూరం ఈడ్చుకుపోవడంతో భాగ్యలక్ష్మి తలకు, ముఖానికి తీవ్రగాయాలయ్యాయి. లారీ ఆగకుండా వెళ్లిపోగా స్థానికులు వెంబడించి మోపిదేవి వద్ద అడ్డుకున్నారు. భాగ్యలక్ష్మికి విజయవాడ ఆస్పత్రిలో శస్త్రచికిత్స నిర్వహిస్తున్నట్లు బంధువులు తెలిపారు.

అక్రమ ఇసుక తవ్వకాలను అడ్డుకోవాలి

జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ

శ్రీకాకుళం(ఘంటసాల): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ జెడ్పీటీసీ తుమ్మల మురళీ కృష్ణ ఆరోపించారు. ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సాయంత్రం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ వేమూరి రజనీకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా సాయంత్రం 6 గంటలు దాటిన తర్వాత కూడా శ్రీకాకుళం క్వారీలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని తహసీల్దార్, పోలీసు శాఖ వారు చర్యలు తీసుకోవాలని కోరడంతో సమావేశంలో ఉన్న టీడీపీ ప్రజా ప్రతినిధులు శ్రీకాకుళం సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్, ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) వాగ్వాదానికి దిగారు. స్పందించిన తహసీల్దార్ బి.విజయప్రసాద్ శ్రీకాకుళం ఇసుక క్వారీకి అనుమతులు ఉన్నాయని, ఇటీవల సమయం దాటిన తర్వాత అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు రావడంతో రాత్రుళ్లు వెళ్లి వాహనాలు సీజ్ చేశామని చెప్పారు. గ్రామాల్లో సీసీ రోడ్ల పనులకు సంబంధించిన బిల్లులు రాలేదని పలువురు ప్రశ్నించగా త్వరలోనే వస్తాయని అధికారులు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో డి.సుబ్బారావు, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తూర్పు తెలుగుపాలెంలో పోలీస్ పికెట్ ఏర్పాటుకు చర్యలు

పెడన: పట్టణంలోని పదో వార్డు తూర్పు తెలుగుపాలెంలో పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేసి, పీస్ కమిటీని నియమిస్తామని మచిలీపట్నం డీఎస్పీ అబ్దుల్ సుభానీ తెలిపారు. ఆయన శనివారం పెడన సీఐ నాగేంద్రప్రసాద్‌తో కలిసి తూర్పు తెలుగుపాలెంలో విచారణ నిర్వహించారు. బలిపర్రుకు చెందిన పాతపాటి ఆనంద్ తూర్పు తెలుగుపాలెంలోని తన బంధువుల ఇంటికి ఈనెల 15న వచ్చిన సమయంలో రహదారిపై బహిరంగ మూత్ర విసర్జన చేస్తున్నాడని స్థానికులు అభ్యంతరం తెలిపారు. ఈ విషయమై ఇరువర్గాల మధ్య జరిగిన వివాదం నేపథ్యంలో ఆనంద్‌పై దాడి జరిగినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. దీనిపై విచారణ నిర్వహించిన డీఎస్పీ అబ్దుల్ సుభాన్ మాట్లాడుతూ ఇటువంటి గొడవలు పునరావృతం కాకుండా వివిధ సామాజిక వర్గాల పెద్దలతో పీస్ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. పోలీస్ పికెట్ పెడతామని చెప్పారు.